సీరియల్

విషసర్పాలు

సికిందర్

ఒకటే హోరుగా కురుస్తోంది వర్షం....

ఆకాశం నల్లటి కంబళి కప్పేసినట్టు మహా గంభీరంగా వుంది.

కింద అల్లకల్లోలాన్ని సృష్టిస్తూ, నిశ్చలంగా వున్న కారుమేఘాలతో కుండపోతగా కురిపిస్తోంది వర్షాన్ని...

హెచ్చరిక ప్రకటించి ఎనిమిది గంటలు దాటిందప్పటికి—తుఫాను హెచ్చరిక.

ప్రకటించిన టైముకి రెండు గంటలు ఆలస్యంగా అయితేనేం, ప్రారంభమైంది, ఈదురు గాలులతో కూడిన కుంభవృష్టి!

గంటకు దెబ్బై కిలోమీటర్ల వేగంతో వీస్తూన్న గాలితో, అరగంట నించీ ఏకధాటిగా కురుస్తూన్న వర్షానికి కింద రోడ్లూ, పల్లపు ప్రాంతాలూ ఇట్టే జలమయి పోతున్నాయి....

పదిగంటలు కాలేదింకా టైము—చలిచీమల్లా పుట్టుకొస్తున్న జనాభాతో ఇరవై నాలుగ్గంటలూ రణగొణ ధ్వనులతో కిటకిటలాడుతూ వుండే జంటనగరాలిప్పుడు, అంత జనాభానీ ఏదో మహాతీత శక్తి అదృశ్యంచేసినట్టు నిర్మానుష్యమై పోతున్నాయి ప్రాంతాలన్నీ ...

ఎండకి వెరవని వాళ్ళుండవచ్చు.

కానీ వర్షానికి తలదాచుకోని ప్రాణిలేదు.

ప్రస్తుతం ముక్కుతూ మూల్గుతూ, నడుములేని ముసలమ్మలా కదుల్తూ, ప్రకృతితో తీవ్ర పోరాటం జరుపుతూ సాగుతూన్న ఆటోలో, ఇరువైపులనించీ ఈడ్చికొడుతున్న ఈదురుగాలులకి గజగజ వణికిపోతూ, కసురుకుంటూ కష్టపెడుతున్న డ్రైవరుమీద విసుక్కుంటూ, ముడుచుక్కూర్చున్న సుహాసినికి, ఇంటికెప్పుడు వెళ్ళి పడతానా అని మహా ఆరాటంగా వుంది.

కానీ ఈ తీరున ఇంకో గంటయినా పడుతుందని ఆమెకు తెలుసు. తెలిసీ ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో వుంది. అంతా ఈ డ్రైవరు చేతిలో వుంది.... ఇతను మాత్రమేం చేస్తాడు? ప్రచండంగా వీస్తున్న ఎదురువాటం గాలి! వేగం పెంచలేడు. మలుపులు తిరిగినప్పుడు గాలి దిశ మారుతుంది. అది ప్రమాదకరమైన దిశ! ఏ మాత్రని వేగం పెంచినా బండితోసహా లేచిపోతారిద్దరూ! ఆమె తడిసి ముద్దయింది....

చెవుల్లోకిదూరే ప్రతి గాలి కెరటం, మంచుకైజారులా కోసేస్తోంది నిలువునా లోన! జివ్వున నరాలు చిట్లిపోయే బాధ! రక్తం గడ్డకట్టే పరిస్థితులు. ఒళ్ళు మంచుగడ్డయిపోతోంది. పళ్ళు విపరీతంగా శబ్దం చేస్తున్నాయి... ఎంత అదిమి పట్టుకుందామనుకున్నా వుండటంలేదు దవడలు. డొక్కు ఆటో! డొక్కు ప్రయాణం! తిట్టుకుంటోందామె. తను కారెందుకు తెచ్చుకోలేదూ ఇంటినుంచి? వెంటనే కారప్పుడు ఇంట్లో లేదని తట్టింది.... పోనీ తనిప్పుడే బయల్దేరకపోతే ఏం పోయింది? ఆమెకు ఒంటరిగా బయట గడపటం ఇష్టపడని తల్లిదండ్రులు మెదిలారు.

ఒంటరిగానా?

ఆమె ముఖం చిటపటలాడింది. ఇలా వంటరిగా వదల డానికి భయపడేవాళ్ళు, రేపు తనను కలలుగంటూన్న తన స్వేచ్ఛా జీవితాన్ని ఎలా అనుమతిస్తారు?

ఆమె ముఖం మ్లానమైంది.

పిడికిలి బిగిసింది.

లేదు, తన నిర్ణయం మారదు! అనుకుందామె. వాళ్ళ కింకా తన ఉద్దేశ్యాలు చెప్పలేదు. అయితేనేం, ఆ సమయం వచ్చినప్పుడు తను తలొగ్గకూడదు! వాళ్ళు ఏడ్చి మొత్తుకున్నా, బెదిరించి బహిష్కరించినా, సరే, నిర్ణయం మార్చుకోకూడదు! ఇంకో మూడేళ్ళు. తన చదువై పోతుంది. అప్పుడు ఈ సంకెళ్ళన్నీ తెంచుకొని, స్వేచ్ఛా జీవియై, పాటుపడుతుంది—తన ఆశయాల్ని ఆచరణలో పెట్టే ప్రయత్నం కోసం! జీవితానికి తానివ్వాలను కుంటున్న అర్థాన్ని ఆ విధంగానే ఇవ్వగలుగుతుంది.

అప్పుడు—

అప్పుడామె మనసు ఎలాగో అయిపోయింది.... అది గుర్తొచ్చినప్పుడల్లా ఇలాగే అయిపోతుంది....నిర్మలంగా వున్న కొలనులో యెక్కడినుంచో వచ్చి పడ్డ రాయిలా అన్పిస్తాడా నరేన్! తనలో అలజడి రేపి, కకావికలం చేస్తాడు మనసుని!

తనకెంత అసహ్యం అతనంటే! ఎంత ఏవగింపు ఆ రకమైన వ్యవహారాలంటే! ఆ ఆలోచనల్నే ఛీత్కరించు కుంటుంది! అసలు తానీ ప్రేమా దోమా అనే భావాలకే స్పందించదు. అందరు అమ్మాయిల్లా మోహావేశానికి లోనవదు. తనకేమీ అన్పించదు అబ్బాయిల్ని చూస్తే. అందరిలా సిగ్గుతో మొగ్గయిపోదు. వూహల్లో తేలిపోదు.

వెర్రిచేష్టలు చేయదు. అతీతంగా వుంటుంది. వేళ్ళు తాకితే గుండె ఝల్లుమనదు. చూపులు కలిస్తే హృదయం పులకించదు. చిరునవ్వులకి చలించిపోదు. ఏమీ అవదు. ఏమీ కాదు. ఎందుకని?

ప్రేమికులంతా అనేదేమిటి! పుస్తకాల్లోనూ, సినిమాల్లోనూ చెప్పేదేమిటి? అదంతా ప్రేమికుల ఉన్మాదమూ, రచయితల పైత్యమేనా? లేక తనలో లోపమా?

లోపమా? ఆమె తత్తరపడింది. తనలో లోపమా? తను జడురాలా? స్త్రీ హార్మోన్‌లు తనలో తగినంత లేవా?

కాదు! బలవంతంగా ఈ ఆలోచనని దూరంచేసుకుందామె. కాదు, ఈ కారణంగా కాదు. తన ధ్యాసంతా జీవితాశయంమీదనే కాబట్టి నరేన్‌ని అలా తృణీకరించింది. అంతే కానీ....ఆ తృణీకరించిన విధానం మాత్రం జీవితాంతం తనని బాధిస్తుంది!

తను నరేన్‌ని అలా తిరస్కరించి వుండాల్సింది కాదు.

ఉలిక్కిపడి తేరుకుందామె. ఏమైంది?

ఆటో ఆగిపోయి వుంది. ఎందుకో తెలియదు.

"డ్రైవర్, యేమైంది?" అడిగిందామె వణుకుతూ.

డ్రైవర్ పలకలేదు.

"డ్రైవర్ ఏమైంది?" రెట్టించిందామె అసహనంగా.

అప్పుడు చూసిందా చీకట్లో....

డ్రైవరు కిరుప్రక్కలా ఇద్దరు. ఇద్దరి చేతుల్లో తెల్లగా మెరుస్తూ....

కలవరపడిందామె. యేమిటి? యెవరు వాళ్ళు? ఎందుకాపారు?

ఆ రెండు గొంతులు డ్రైవర్ని హెచ్చరిస్తున్నాయి.

చల్లటి చలికెరటానికి బదులు, అప్పుడు నులి వెచ్చటి

స్పర్శ తన తడి చెంపకి సోకగానే తలతిప్పుతూ చూసింది సుహాసిని—అదిరిపడి కెవ్వుమని ఒక్క కేక వేసిందామె..

* * *

రామేశ్వరరావు ఉద్రేకంగా గదిలో పచార్లు చేస్తున్నాడు. ఒక్కచోట క్షణం ఉండలేకపోతున్నాడు. మధ్య మధ్యలో ఆగి భార్యమీద అరుస్తున్నాడు....

"బుద్ధి లేదు నీకు! నీ కసలు బుద్ధుందా? దాన్ని పూట పంపవద్దన్నానా వంటరిగా? నా మాటలు నీకేమయినా తలకెక్కాయా? చూడిప్పుడు నీ ముద్దుల కూతురేం చేసిందో!"

"అది నా ముద్దుల కూతురు కాదు, మీ గారాల పట్టి!"

"నాన్సెన్స్! సినిమా డైలాగులు వల్లించకు!"

"బర్త్ డే పార్టీయట! ఎవరా ఉత్తమురాలు? పుట్టి ఉద్ధరించేది లేదుగానీ, పార్టీలు చేసుకుంటారు! పార్టీలు! వీళ్ళ హిపోక్రసీ తగలడిపోను—బయల్దేరి గంటన్నరయిందట! ఎంతసేపు పడుతుంది యిల్లు చేరడానికి" అతను ఆవేశంగా ఫోను దగ్గరకు వెళ్ళాడు.

"ఎందుకంత కంగారుపడుతున్నారు, డాడీ? రాకుండా ఎక్కడికి పోతుంది, మీ చాదస్తం గాని!" అంతసేపూ వాళ్ళని పట్టించుకోకుండా సోవియట్ జర్నలు తిరగేస్తున్న సతీష్ అన్నాడు.

"నీకు చెల్లెలంటే ప్రేమానురాగాలు లేవు, నాన్సెన్స్!" అరిచాడు రావ్.

"అదిగో సినిమా డైలాగు—" అంది భార్య.

రామేశ్వరరావు గబగబా మరికొన్ని చోట్లకి ఫోన్లు చేసి నిరాశగా నిట్టూర్చాడు. "ఎక్కడా లేదు! యెవ

రింటికీ వెళ్ళలేదు! ఈ వర్షంలో ఎక్కడ చిక్కుకుందో—నేనే వెళ్ళి చూస్తాను!"

"ఆగండి డాడీ," అన్నాడు సతీష్. "మీరు ఎక్కడికని వెళ్ళి వెతుకుతారు? ప్రయాణం కష్టమయితే యెక్కడ దిగిపోయిందో .....యే థియేటర్లో వెళ్ళి కూచుందో ...."

"అదేనా దాని బాధ్యత? ఫోన్ చేయక్కర్లా?" కసిరాడు రావ్ అక్కడ్నించి కదుల్తూ, "లేదు నే వెళ్ళి చూస్తాను. ఇలా చేతులు ముడుచుకుని కూచోలేను. నాకేదో....నా కేదో....కీడు శంకిస్తోంది సతీష్! యాక్సిడెంట్ జరిగివుంటే ఆటోకి?"

"పదండి డాడీ! నేనూ వస్తాను."

తండ్రీ కొడుకులు బయటి కదిలారు ఆమెని వదిలేసి. ఆమె ఆందోళనగా వుండిపోయింది. సతీష్ కారెక్కి స్టార్టు చేశాడు. వర్షం తగ్గుముఖం పట్టింది కానీ గాలి ఇంకా అలాగే వుంది. ఆమె వచ్చే మార్గం పొడవునా వాళ్ళు చూసుకుంటూపోయారు. మధ్య మధ్యలో ఆగుతూ కనుక్కున్నారు. థియేటర్లలో కూడా అడిగి చూశారు. రెండుసార్లు యింటికి ఫోన్ చేశారు వచ్చిందేమోనని. రాలేదు. వాళ్ళకి నిరాశే మిగులుతోంది....

తండ్రీ కొడుకులు అలసిపోయి, కారాపేసి కూర్చున్నారు.

"ఏం చేద్దాం యిప్పుడు?" సతీష్ అన్నాడు ఆందోళనగా.

"ఏదో జరిగింది....రాలేకపోతే ఫోన్ చేయకుండా అదింత బాధ్యతారహితంగా ప్రవర్తించదు. ఏదో జరిగింది సతీష్! ఇక మనం పోలీస్ రిపోర్టివ్వడం మంచిదను

వుంటాను."

"వద్దు డాడీ!"

"ఎందుకు వద్దురా?"

"చాలా గొడవవుతుంది. మన గౌరవం చూసుకోవాలి. సుహాసినిని ఇప్పుడే పరిస్థితుల్లో వుందో — రేపు దాని స్నేహితులకీ, లోకానికీ తెలిసిపోతే తలెత్తుకో లేము! పోలీసులు వద్దు, డాడీ! వీలయినంత రహస్యంగా గాలిద్దాం...."

"సతీష్, నే నాలోచించలేక పోతున్నాను.... దాని కేదయినా జరిగితే భరించలేనురా...."

"అలా అనుకోకండి డాడీ! ఏమీ జరగదనే ఆశిద్దాం. ముందు మనం ఒక చోటికి వెళ్దాం...."

"ఎక్కడికి?"

"డిటెక్టివ్‌ల దగ్గరికి...."

"డిటెక్టివ్‌లా!"

"అవును. వాళ్ళవల్ల ఏదీ పొక్కదు డాడీ! సుహాసిని ఎక్కడున్నా వెతికి వాళ్ళు తీసుకవస్తారు ఈ రాత్రికి. ముందు మనం ఇంటికెళ్ళి ఆమె ఫోటో తీసుకవద్దాం...."

కారు స్టార్టుచేశాడు సతీష్ వెంటనే.

"నాకేం అర్థం కావడంలేదు సతీష్. ఎవరా డిటెక్టివ్‌లు?"

వేగం పెంచుతూ చెప్పాడు సతీష్, "లాల్ అండ్ జాన్, డాడీ."

* * *

తార్నాకలో వుండే తన స్నేహితురాలు రూప ఇంటి నుంచి, హిమయత్‌నగర్‌లో తమ యింటికి చేరుకోవాలంటే సుహాసిని, సీతాఫల్ మండి, కవాడిగూడల

మీదుగా టాంక్‌బండ్ వచ్చి, అక్కడ్నించి లిబర్టీ వైపు తిరిగి రావాలి.

ఆమె ఎప్పుడూ ఉపయోగించే మార్గం ఇది. ఆమె తార్నాక నుంచి తొమ్మిదిన్నరకే బయల్దేరింది. అప్పుడే వర్షం మొదలయింది. సాధారణ వాతావరణ పరిస్థితుల్లో అయితే ముప్ఫైఅయిదు—నలభై నిమిషాల్లో చేరుకోవచ్చు. ఇవ్వాళ ఈ వర్షాన్నిబట్టి, గంట గంటన్నర యెక్కువ వేసుకున్నా ఆమె పదకొండున్నరలోపే చేరుకోవాలి. కానీ ఇప్పుడు అర్ధరాత్రి దాటుతున్నా జాడలేదు. ఎక్కడ్నించీ కబురు లేదు. ఆమె యెప్పుడూ రాత్రిళ్ళు చెప్పకుండా బయట గడపలేదు.

ఈ విషయాలన్నీ విని, ట్విన్‌సిటీస్ డిటెక్టివ్ ఏజెన్సీ పార్ట్‌నర్స్ లాల్ అండ్ జాన్‌లు, ఆ తండ్రీ కొడుకుల్ని సాలోచనగా చూశారు.

అప్పుడన్నాడు లాల్ సిగరెట్ వెలిగించుకుంటూ, "మీరు పోలీసు రిపోర్టు యివ్వకపోవడం మంచిది కాదు. ఈ పరిస్థితుల్లో మీ అమ్మాయికి ప్రాణాపాయం గురించి ఆలోచించాలి. ఆమెకింకేదో కీడు జరిగిందని యెందుకనుకుంటారు? పదండి, మనం ఇప్పుడు వెళ్ళి చూద్దాం...."

నలుగురూ లేచి బయటికి నడిచారు. జాన్ సుహాసిని ఫోటో జేబులో పెట్టుకుని, ఆఫీసుకు తాళం వేశాడు.

కిందికి వచ్చిన నలుగురూ డిటెక్టివ్‌ల కారెక్కారు. తండ్రీ కొడుకులు వెనక కూర్చున్నారు. జాన్ స్టార్టు చేసి పోనిచ్చాడు. లాల్ చెప్పాడు అతనికి: "రివర్స్ జర్నీ, పార్ట్‌నర్! టాంక్‌బండ్‌నించి తిన్నగా తార్నాక— మధ్యలో ప్రతి పోలీస్‌స్టేషన్ దగ్గరా ఆపు. అక్కడేవయినా రిపోర్టులందాయేమో చూద్దాం. కమాన్,

క్విక్!"

జాన్ వేగం పెంచి నిటారుగా కూర్చున్నాడు. కారిప్పుడు శరవేగంతో పోతోంది. లాల్ సిగరెట్ పీలుస్తూ ఆలోచనల్లో పడ్డాడు. తండ్రీ కొడుకులు మాట్లాడకుండా యెవరి ఆలోచనల్లో వాళ్ళు ఉద్రేకంగా గడుపుతున్నారు.

మళ్ళీ టపటపమంటూ చినుకులు ప్రారంభమయ్యాయి. పైన కారుమబ్బులు చాలా కిందినుంచి ఏదో అర్జంటు పని వున్నట్టు వేగంగా సాగిపోతున్నాయి. రోడ్డుమీద అక్కడక్కడ వాహనాలూ, మానవ సంచారముంది. నీటి కాలువ లింకా ప్రవహిస్తూనే వున్నాయి.

అలా వెళ్తోన్న కారు వెనుక నుంచి హెడ్ లైట్లు పడ్డాయి. లాల్ తిరిగిచూశాడు. కొంతదూరంలో ఓ కారు కన్పించింది, వేగంగా వచ్చేస్తూ. జాన్ అది గమనించి, ఓవర్ టేక్ చేయబోతోందని యింకా వేగం పెంచాడు.

అకస్మాత్తుగా వెనుక సైరన్ వినిపించింది.

జాన్ ఉలిక్కిపడి ఇంకా వేగం పెంచేశాడు!

"ఏమిటి, పారిపోతావా? క్రిమినల్ వా? స్లోడవున్!?" అరిచాడు లాల్.

నాలిక కరుచుకుని స్పీడు తగ్గించేశాడు జాన్.

వెనుకనుంచి ఆ పోలీసుకారు రివ్వున ఓవర్ టేక్ చేస్తూ వెళ్ళి ముందాగింది.

తటాలున డోర్స్ తెరుచుకున్నాయి—

గభాల్న ఇద్దరు అధికారులు కిందికి దూకారు.

వాళ్ళు రివాల్వర్స్ చేతబట్టి పరుగెత్తుకొచ్చారు చెరో వైపున.

జాన్ అయోమయంగా చూశాడు వాళ్ళని.

"ఎవరు మీరు? యెక్కడ్నించి వస్తున్నారు? యీ కారు మీదేనా? కారులో యెవరెవరున్నారు? కమాన్, జోషీ! వెనుక సీట్లో ఎవరున్నారో చూడండి—" అరిచాడు జాన్ వైపున్న అధికారి.

లాల్ వైపు అధికారి వెనుక డోర్ దగ్గరికి కదిలి తొంగి చూశాడు. తండ్రీ కొడుకులు బిత్తర చూపులు చూస్తున్నారు.

"మాట్లాడరేం? ఎవరు మీరు? కమాన్, ఈ కారెక్కడిది?"

జాన్ వైపు అధికారి గర్జించాడు. జాన్ నోరు విప్పలేదు. తాపీగా సిగరెట్ తీశాడు.

లాల్ అతన్ని ఓరకంట చూశాడు.

"లేడీస్ యెవరూ లేరు!" వెనుక నున్న అధికారి అరిచాడు.

"ఎక్కడో వదిలేసి వుంటారు! కమాన్, గెడవున్!" జాన్ కళ్ళముందుకు రివాల్వర్ వచ్చింది.

అప్పుడు లాల్ అయిష్టంగానే లోపల లైటు స్విచ్ నొక్కాడు.

ఆ వెలుతురులో డిటెక్టివ్‌లు ఒకర్నొకరు చూసుకుని నవ్వుకున్నారు.

"మైగాడ్, లాల్ అండ్ జాన్!" రివాల్వర్ చూపిన అధికారి అరిచాడు.

"పార్ట్‌నర్స్ ఇన్ డిటెక్షన్" లాల్ అన్నాడు నవ్వుతూ.

"ట్విన్ సిటీస్ డిటెక్టివ్ ఏజెన్సీ..." జాన్ కూడా చెప్పాడు.

"ఓహ్, ఏమిటిది?"

"మీరే చెప్పండి, కృష్ణన్! ఏమిటీ హడావుడి?"

కృష్ణన్ లాల్ వైపు పరుగెత్తుకొచ్చాడు, "మేన్ హాంట్, మిస్టర్ లాల్! కవాడిగూడ నుంచి వైర్ లెస్. ఒక ఆటో డ్రైవర్ రిపోర్టిచ్చాడట—తన ఆటోని ఎవరో ముగ్గురు అటకాయించి, అందులో యువతిని తీసుకుపోయారని—"

"ఎక్కడ?"

"ఆ ప్రాంతాలే—కవాడిగూడ దగ్గర."

వాళ్ళెలా వున్నారు?"

"చూడలేదట. కత్తులున్నాయట ముగ్గురి దగ్గరా! డ్రైవర్ని కిందికిలాగి, తలమీద కొట్టి పడేశారట. ఆమెని తీసుకుని పారిపోయారట—"

"ఎందులో?"

"కారులో! వైట్ ఫియట్. డామిట్, మీ కారు చూసి అదేననుకున్నాను. నెంబర్ చూడలేదు—అనుమానంతో ఆపిచూస్తే మీరున్నారిందులో!"

"నెవర్ మైండ్. ఇంకా చాలా చోట్ల ఆపుతారు మమ్మల్ని. ఆ డ్రైవర్ స్టేషన్లోనే వున్నాడా?"

"ఉండొచ్చు, మీరు వెళ్తున్నారా?"

"వెళ్ళాలి. ఆ కారు నెంబర్ని డ్రైవరు చూశాడా?"

"లేదు—"

కామేశ్వరరావు అప్పుడు తేరుకుని కారు దిగేశాడు. అతను వేగంగా కృష్ణని చేరుకుని చేతులు పట్టుకున్నాడు: "ఏమిటిది ఇన్స్పెక్టర్? ఏం జరిగింది మా అమ్మాయికి? యెవరు తీసుకెళ్ళారామెని? యెక్కడికి? యేం చేశారు, చెప్పండి!"

కృష్ణన్ అతని చేతిని తట్టాడు. "మీరు భయపడ

కండి. ఆమెని రక్షించే ప్రయత్నంమీదే వున్నాం."

రావ్‌కి ఏడుపు ముంచుకొస్తోంది. సతీష్ వెళ్ళి అతన్ని తీసుకొచ్చాడు.

"సో లాంగ్, లాల్."

"సో లాంగ్ కృష్ణన్."

జాన్ స్టార్టుచేసి కారుని వేగంగా పోనిచ్చాడు.

"మీ అమ్మాయి ఏం చేస్తోంది రావుగారూ, చదువుతోందా?" లాల్ అడిగాడు వెనక్కి చూస్తూ.

"అవును.... మెడిసిన్ నాలుగో సంవత్సరం, సర్."

"ఆరె ..." లాల్ యింకేమీ అనలేకపోయాడు.

"ఆమెని కాపాడాలి, మిస్టర్ లాల్! లేకపోతే నేను బ్రతకలేను!"

"డాడీ, ప్లీజ్ ...." సతీష్ వూరుకోబెట్టాడు తండ్రిని.

సెక్రటేరియేట్ ముందు యింకో స్క్వాడ్ ఆపింది కారుని. డిటెక్టివ్‌లని చూసి, "అన్ని వైట్ ఫియట్స్‌ని చెక్ చేస్తున్నాం మిస్టర్ లాల్. పట్టుకోగలమన్న నమ్మకముంది!" అన్నాడా అధికారి.

రావ్ తల వంచుకుని గొణుక్కుంటున్నాడు.

జాన్ తిరిగి స్టార్టుచేసి పోనిచ్చాడు. "పార్టనర్ వీళ్ళిలా ఆపుతూపోతే మనం తెల్లారి చేరుకుంటామనుకుంటాను కవాడిగూడాకి."

"నాకు నమ్మకం లేదు...."అన్నాడు లాల్ దూరంగా చూస్తూ, "అదిగో మరో బ్లాకేడ్ ఎదురవుతోంది పార్టనర్. ఆ చెట్టుకింద....ఎవరు వాళ్ళు? స్లో డవున్, జాన్. రోడ్డు మధ్య నిలబడ్డారు వాళ్ళు...."

జాన్ వేగం తగ్గిస్తూ తీసుకెళ్ళి ఆక్కడ ఆపాడు కారుని.

వెంటనే ఎనిమిదిమంది చుట్టుముట్టారు కారుని. వాళ్ళు పోలీసులు కారు. వాళ్ళందరి చేతుల్లోనూ ఆయుధాలున్నాయి, రివాల్వర్స్.

కుడిపక్క ఆగివుంది, ఒక బ్లూ కలర్ మెటడార్ వ్యాను.

వాళ్ళు రివాల్వర్ గురిపెట్టి కారులోకి తొంగి తొంగి చూస్తున్నారు. వాళ్ళందరి ముఖాలూ వికృతంగా భయం గొలిపేలా వున్నాయి. నోళ్ళనించి చింతవాసన కొడ్తోంది. డిటెక్టివ్‌లు రెప్పవేయకుండా చూస్తున్నారు, కదలకుండా కూర్చుని.

తండ్రీ కొడుకులిద్దరు ఒకర్నొకరు అంటుకుపోయి కూర్చున్నారు.

"అమ్మాయి ఏదీ?" అడిగాడు జాన్ వైపు మనిషి. అతన్ని చూశాడు జాన్, రెయిన్ కోటూ క్యాపుతో భారీగా, యెత్తుగా వున్నాడు. ముఖం కనిపించడం లేదు....

"ఏ అమ్మాయి?" జాన్ అన్నాడు తేరుకుని, ముందుకు జరిగి ఆ మనిషిని బాగా చూడాలని ప్రయత్నిస్తూ.

వెంటనే అతని తలకు రివాల్వర్ ఆనింది. "కదలకు, మిస్టర్! చేతులెత్తు. అందర్నీ చేతులెత్తమనండిరోయ్!" ఆజ్ఞాపించాడు రెయిన్‌కోటు మనిషి, తన అనుచరుల్ని.

వాళ్ళంతా రివాల్వర్స్ తలల కానించారు. అందరూ చేతులెత్తి కూర్చున్నారు.

రెయిన్ కోటుమనిషి ఎడమచేయి లోపలికి పెట్టి హెడ్‌లైట్స్‌ని ఆఫ్ చేసేశాడు. జాన్ లోలోపల నవ్వు

కున్నాడు అది చూసి—ఆ మనిషి చేతులకి గ్లవ్స్ లేవు.

అప్పుడా మనిషిని జాన్ స్పష్టంగా చూశాడు—పొడ వాటి ముఖం, మాసిన గడ్డం, అంత చురుగ్గా లేని కళ్ళు. ముసలి ఆకారం.

"ఇక ఆలస్యం చేయకండి, చెప్పండి! అమ్మాయి ఎక్కడ?"

"ఏ అమ్మాయి?" అదే ప్రశ్న వేశాడు జాన్, డ్రైవింగ్ మిర్రర్‌లో చూస్తూ. వెనుకనుంచి యే వాహనమూ రావడంలేదు. రోడ్డంతా ఖాళీగా వుంది.

"మీ రెత్తుకొచ్చిన అమ్మాయి!" గద్దించా డా మనిషి.

"మేమెవరినీ యెత్తుకురాలేదు. మేమలా కనిపిస్తున్నామా?"

"తిన్నగా మాట్లాడకపోతే చచ్చిపోతారు. మా కా అమ్మాయి కావాలి."

"దేనికి?" అన్నాడు జాన్.

లాల్ తనవైపు వాడ్ని పట్టించుకోకుండా, రెయిన్ కోటువాడికేసి తిరిగాడు. "ముందు మీరు చెప్పండి, యెవరు మీరు? మీ కెందు కా అమ్మాయి? ఏమి టీ దౌర్జన్యం?"

"మేం సి. ఐ. డీ. లం. ఆ అమ్మాయిని గాలిస్తున్నాం."

"ఐ.సీ....సి. ఐ. డీలు మెటడార్ వ్యానేసుకుని తిరగడం నేను చూడలేదు."

"పద్ధతులు మారాయి, మారుతున్నాయి. ఏ కాలంలో వున్నారు మీరు?"

"మీ రే లోకంలో వున్నారు? క్రైంబ్రాంచిలో

మా మొహం యెరుగని ఆఫీసరు లేడు. మమ్మల్ని యింకా గుర్తించలేదా?"

"సారీ, నే నిక్కడ కొత్తగా ట్రాన్స్‌ఫరయ్యాను. మీ పరిచయ భాగ్యం కలగలేదు. మీ రెవరో సెలవివ్వండి...."

"లాల్ అండ్ జాన్."

ఆ మనిషి గడ్డం రుద్దుకున్నాడు, "బట్టల వ్యాపారాలా?"

"నో, తోళ్ళ వ్యాపారులం" చెప్పాడు జాన్.

"అయితే యిలా యెందుకు తిరుగుతున్నారు రాత్రి పూట?"

"తోళ్ళు వలవడానికి. మనిషితోలుకి మంచి డిమాండు వుంది ఆఫ్రికాలో."

"సరసాలాడకండి. ఆ అమ్మాయిని ఎక్కడ వదిలి వేశారో చెప్పండి, మిమ్మల్ని ఏమీ చెయ్యం."

రామేశ్వరరావు ఉద్రేకపడుతున్నాడు. సతీష్ తండ్రి చేయి బలంగా పట్టుకున్నాడు.

లాల్ సాలోచనగా తలూపాడు, "సరే పదండి, చూపిస్తాం" అన్నాడు.

రెయిన్‌కోటు మనిషి వెంటనే అన్నాడు, "నో, ఎక్కడుందో చెప్పండి, వెళ్ళి చూస్తాం" మీలో ఒకరు వస్తే చాలు."

డిటెక్టివ్‌లు చూపులు మార్చుకున్నారు—

అంతవరకూ ఎలాగో కూర్చోగలిగిన రామేశ్వరరావు, యిక ఉండబట్టలేక అనూహ్యంగా ఒక్క తోపు డోర్‌ని తోసి, అక్కడున్న రివాల్వర్ మనిషిని కింద పడవేస్తూ, కారు దిగేశాడు. దిగి రెచ్చిపోతూ రెయిన్‌కోటు మనిషి

దగ్గరికి ఉరికాడు. ఉరికి వెళ్ళి అతడి కాలరు పుచ్చు కున్నాడు. ఆ చెంపా ఈ చెంపా వాయించేస్తూ అరవ సాగాడు—

"ఎందుకు నీకు మా అమ్మాయి? ఏం చేస్తావామెని? ఎవరు మీరసలు? ఎందుకిలా బెదిరిస్తున్నావ్ మమ్మల్ని? చెప్పు— చెప్పు— చెప్పూ—"

జాన్ తటాలున డోర్ తీసి దిగబోయాడు. కానీ కింద పడ్డ మనిషి ఒక్క గంతులో లేచివచ్చి కంట్రోల్ చేశాడు, "డోంట్ మూవ్, ప్లీజ్!"

రెయిన్ కోటు మనిషి తేరుకుని రావ్ ని ఒక్క తోపు తోశాడు. అతను బాయ్ నెట్ మీద పడగానే గొంతు పట్టుకుని లేపి గర్జించాడు. "ఏమిటి కూస్తున్నావ్, ఎవరా అమ్మాయి? ఏమవుతుంది నీకు? నిజం చెప్పు?"

"నా కూతురు! సుహాసిని నా కూతురు!"

సతీష్ దిమ్మెరపోయి చూస్తున్నాడు.

డిటెక్టివ్ లింకా అలాగే చేతులెత్తి కూర్చున్నారు, జరుగుతున్నది నిస్సహాయంగా గమనిస్తూ.

రెయిన్ కోటు మనిషి రావ్ ని ఒక్కసారి వదిలేశాడు: "ఓహ్ .... పప్పులో కాలేశాం! శంకర్, పదండి చెక్కేద్దాం! రాంగ్ పార్టీని పట్టుకున్నాం. కారు నెంబర్ తెలియకపోతే ఇలాగే వుంటుంది తంటా! కమాన్, అందరూ వ్యానెక్కేయండి— లెట్స్ గో!"

అనుచరులందరూ వ్యాను దగ్గరికి పరుగెత్తారు.

ఆ మనిషి డిటెక్టివ్ లని చూసి, "సారీ, ఫ్రెండ్స్. మేం పొరబడ్డాం. అనవసరంగా మిమ్మల్ని కష్టపెట్టాం.... ఇక మీరు వెళ్ళిపోవచ్చు. కానీ ఒక్కమాట.... మీ రా అమ్మాయికోసం ఇంక వెతకకూడదు!"

రావ్ అతని మీదికి ఉరికాడు, "వెతుకుతాం! గాలిస్తాం మా అమ్మాయిని! నువ్వెవరు వద్దనడానికి? నీకు మేమేం...."

రావ్ మాట పూర్తి చేయలేదు. అతను హఠాత్తుగా గుండె పట్టుకుని కిందపడ్డాడు, ఆ మనిషి కాళ్ళదగ్గర. ఆ మనిషి దూరంగా జరిగిపోయి డిటెక్టివ్ లకి గురిపెట్టాడు సైలెన్సర్ రివాల్వర్ని: "చూశారా, చంపాను. సారీ, అతను ప్రతిఘటించే కష్టమవుతుంది మా పని. కూతుర్ని వెతక్కూడదతను. మీరూ వెతక్కూడ దిప్పుడు....మర్చిపోవాలి! ఓ.కే.?"

వెనుక సీట్లోంచి సతీష్ విసురుగా దిగేశాడు కిందికి. ఆ మనిషి అంతకంటే వేగంగా కదిలి అతన్ని లోపలికి తోసి డోర్ మూశాడు.

"గుడ్!" అన్నాడతను, "కింద రక్తంమడుగులో పడి వున్న కామేశ్వరరావుని దాటి వస్తూ, ఫ్రెండ్స్, విన్నారా నా హెచ్చరిక? జాగ్రత్త, ఆమెని వెతుక్కోండి! ఆమెకోసం ప్రయత్నించ వద్దు. ఇప్పుడు మమ్మల్ని వెంటాడి రాకూడదు. అందుకని...."

సైలెన్సర్ రివాల్వర్తో కారు టైరుని బరస్టుచేశాడా ఘరానా రెయిన్కోటు మనిషి.

* * *

గలగలమని గాలికి చెట్ల ఆకులు కదుల్తూన్న చప్పుడు వినిపిస్తోంది....వాటిమీది నీటి బిందువులు చిటపటమని కారు టాపుమీద రాలుతున్నాయి.

ఆమె అప్పుడే కళ్ళు తెరచి చూస్తోంది.

ఆమె కళ్ళకు యీ ప్రపంచం ఎప్పటిలా అగుపించడం లేదు.

అసలు ప్రపంచమే వున్నట్లు ఆమెకు తోచడంలేదు.

తను చూసిన ఆ ప్రపంచం ఇదికాదు, ఇలా లేదు— అందులో యెన్నో స్వప్న సౌధా లున్నాయి, ఆశల శిఖరా లున్నాయి. ఏవీ అవన్నీ? ఏమయిపోయాయి త్రుటిలో?

పటాపంచలయ్యాయి! జీవితం ముక్కలయింది! ముక్కలు చింపినవి సరి అయింది! ఆమె వెక్కి వెక్కి ఏడ్వ సాగింది.... ముఖం చేతుల్తో కప్పుకొని.

కారు వెనుక సీట్లో ఆమె పరిస్థితి ఘోరాతి ఘోరంగా వుంది.

ఏడ్చి ఏడ్చి ఆమె కాస్సేపటికి తేరుకుంది. ఇంక శక్తి లేకపోయింది. ఏడ్చి ప్రయోజనంలేదు. ఇప్పుడు పరిష్కార మార్గం చూడాలి. తనిప్పుడు బ్రతికి యెందుకు? చచ్చి పోవాలి. ఏ ముఖంతో యింటికి తిరిగివెళ్తుంది? స్నేహి తుల్ని చూస్తుంది? చావే పరిష్కారం. అవును, చావాలి! చచ్చిపోవాలి!

ఆమె దిగ్గున లేచి కూర్చుంది. కొన్ని క్షణాలు రెప్ప వేయకుండా, తీక్షణంగా చూస్తూ కూర్చుండిపోయింది యేమీ కన్పించని కారుచీకట్లోకి. ఆ సమయంలో ఆమె మెదడంతా శూన్యంగా వుంది. ప్రమాదంలోకి నడచి వెళ్తున్న స్లీప్ వాకర్ లా, మరేదో అఘాయిత్యానికి పాల్పడబోయే మేనియక్ లా ఆమె కళ్ళలో భావాలు కదుల్తోన్నాయి, భయం గొలిపేవి. ఆమె మెదడులో శూన్యత తొలగి తిరిగి అవే దృశ్యాలు కదుల్తో న్నాయి.

తను విస్తరి. వాళ్ళు కుక్కలు. మూడు కుక్కలు నువ్వా నేనా అన్నట్లు కొట్లాడుకున్నాయి తన కోసం.

తన నోటికి, చేతులకి అప్పుడు కట్లున్నాయి. కల్లు తాగిన కుక్కలు కారులో కుదేసి తనని ఇరుప్రక్కలా ఇద్దరూ, ముందు మరొకడుగా నడుపుకుపోయారు. ఎక్కడది? తనని ఎక్కడికి తీసుకెళ్ళిందీ బాగా తెలుసు తనకి. ఆ దారి బాగా గుర్తుంది. అదొక పాడుబడ్డ కొంప. పెద్ద ఇనుప గేటు. భూతాల్లాంటి చెట్లు. ఏ నవాబో కట్టించి తన కాలం తీరిపోయాక దిక్కులేక శిథిలమైన సౌధ మది. అందులో తుఫాను రాత్రిలో తనని ఆ మూడు కుక్కలు....

ఆ మూడు కుక్కలతో పాటు తను కూడా అప్పుడే ఆ శిథిల సౌధం కూలి సమాధి అయ్యేలా ప్రకృతి కరుణిస్తే బాగుండు నన్పించింది....

గుడ్డి లాంతరు వెలుగులో చూసిన ఆ కుక్కల ఆకారాలు యింకా కళ్ళముందు మెదుల్తూనే వున్నాయి....

ఏ కుక్కకి ఇరవై కి మించదు వయసు.

ఆ తర్వాత యేం జరిగిందో తనకు తెలియదు.

కళ్ళు మూతపడుతున్నప్పుడు మోటారుసైకిలు శబ్దం మాత్రం విన్నది. తన నెవరో మోసుకుపోతున్నట్లు అని పించింది.... అంతే.

ఇప్పుడు మాస్తే తనిక్కడ వదిలివేయబడి వుంది.

ఆమె తేరుకుంది. పరస్పర భావ సంఘర్షణలో ఓ భావం గెలుపొందింది. ఆ భావం చండమారుతంలా ఆమెలో ఏదో తెలీని శక్తిని నింపింది. ఆమె నిలువెల్లా కంపిస్తూ వూగిపోయింది. పిడికిళ్ళు బిగించింది_ముఖ కండరాలు బిగుసుకున్నాయి. తనకు పరిష్కారం చావు కాదు. చావను తను. చావదు తను. చావను! అప్పుడే చావ కూడదు!

ఆమె లేచి ముందుసీటులోకి దూకింది. క్షణంలో కారుని స్టార్టు చేసి వాయువేగంతో ముందుకు పోనిచ్చింది....

అయితే ఆ కారు ఆమెకు అచ్చిరాదని తెలియదు.

వెనుకనుంచి వెంటపడుతున్న పోలీసు కారుని చూసి బెదిరిపోయింది. మరింత....మరింత....మరింతగా వేగాన్ని పెంచేస్తూ, ఎవర్నీ దేన్నీ లెక్కచేయకుండా దూసుకు పోసాగింది....

వెనుక పోలీసు కారుకు మరో జీపు తోడయింది. సైరన్ మోతతో మార్గమంతా మార్మోగిపోతోంది. అందులోని అధికారులు వైర్‌లెస్‌లో ఆగకుండా అరుస్తు న్నారు. మార్గంలో ఎక్కడ పోలీసుస్టేషన్ వున్నా ముందే రియలర్టు చేస్తున్నారు. రోడ్స్‌ని బ్లాక్ చేయిస్తు న్నారు.

కానీ ఆమె ధైర్యం చెక్కుచెదర లేదు. సెక్రటరి యేట్ దగ్గర బ్లాకేడ్‌ని తన రాకెట్ వేగంతో దూరం నించే తప్పుకు నేలా చేసింది, అదరగొట్టేస్తూ. టాంక్ బండ్ మీద ఓ జీపుకు కీచుమని రాసుకుంటూ, దూసుకు పోయింది నిర్లక్ష్యంగా.

అప్పుడామెకు తనేం చేస్తోందో తెలీదు! ఎక్కడి కెళ్తోందో తెలియదు! కంగారు! అయోమయం! భయం! లిబర్టీ వైపు తిప్పి బషీర్‌బాగ్ రోడ్డుపడుతూ, సరీగ్గా సైక్లెన్ రాగానే ఇహ ఈ కారుతో లాభం లేదని గుర్తించింది. సడన్ బ్రేకుతో కీచుమని ముప్ఫై అడుగుల దూరాన ఆపగలిగి, దిగి వురకసాగింది, మరెటూ చూడ కుండా సైక్లెన్ రోడ్డులోకి తిరిగి....

◆ ◆ ◆

పొద్దు బాగా ఎక్కింది. ఇంకా సూర్యుడి జాడ లేదు తొమ్మిదవుతూ న్నా.

ఆకాశం యింకా మేఘావృతమై వుంది. సన్నగా చినుకులు పడుతున్నాయి. రాబోయే పన్నెండు గంటల్లో, గంటకు తొంభై నుంచి నూటాపది కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన భారీ వర్ష సూచన కూడా చేయడం జరిగింది రేడియోలో. బంగాళాఖాతంలో ఏర్పడ్డ వాయుగుండం, ఈ సాయంత్రం కోస్తా తీరాన్ని తాకే సూచనలున్నాయట.... పడే పడే హెచ్చరికలు ప్రసారమవుతున్నాయి.

లాల్ కళ్ళు విప్పి చూశాడు. అవి ఎర్రబడి, అలసి పోయి వున్నాయి. ముఖం నీరసంగా వుంది. లేచి ఆతను కిటికీ దగ్గరికి వెళ్ళాడు.

"పార్టనర్స్, ఇప్పుడా క్రూక్స్‌ని పట్టుకోవడం సాధ్య మయ్యేలా లేదు. వాళ్ళు బోగస్ నెంబర్ ప్లేట్స్ పెట్టు కున్నారు. అవును, ఆ వైట్ ఫియట్‌లో సుహాసిని కిడ్నాప్ చేయబడిందని వాళ్ళకెలా తెలిసింది? ఆమె వాళ్ళకెందుకు? ఎందుకామెకోసం అంతగా ప్రయత్ని స్తున్నారు? ఎవరు వాళ్ళసలు?"

లాల్ సందేహాల్ని జాన్ కూడా తీర్చలేడు, ఒక్కటి తప్ప; కిడ్నాప్ గురించి పోలీస్ ఇన్ఫర్మేషన్‌ని ఎవరో కరప్ట్ ఆఫీసర్ ఆ ముఠాకి అందించి వుండాలి...."

జాన్ ఈ సందేహం వెలిబుచ్చి, "పార్టనర్, దీన్ని మనం వెంటనే కృష్ణన్‌కి తెలియపర్చాలి. ఇంకా ఇలాటి టిప్స్ వెళ్ళకుండా—కమ్యూనికేషన్స్ లీక్ గాకుండా ఎలర్టు చేయాలి. ఏమంటావు?" అన్నాడు.

వెంటనే ఆ ప్రకారం లాల్ ఫోన్ చేసి చెప్పాడు

కృష్ణన్ కి.

నిమిషాల్లో నగరంలో ప్రతి పోలీసుకీ తెలిసిపోయిం దీ విషయం. అం తే, అక్కడ్నించీ వాళ్ళలో ముసలం పుట్టింది. ఒకర్నొకరు అనుమానించుకోవడం మొదలు పెట్టారు. తమలో ఒకడు శత్రువులకి తోడ్పడుతున్న ఉద్యోగి వున్నాడు....ఎవరతను?

రాత్రి కామేశ్వరరావుని హత్య చేసి పారిపోయిన ముఠాకోసం సిటీ అంతటా వల పన్నారు పోలీసులు, డిటెక్టివ్ లనించి ఫోన్ కాల్ అందుకొని. కానీ ఆ వ్యాను జాడ ఎక్కడా దొరకలేదు.

హంతకుడి వేలిముద్రల కోసం, జాన్ సూచనపై, వాడు హెడ్ లైట్స్ ఆర్పినప్పుడు డిటెక్టివ్ ల కారులో డాష్ బోర్డుని పరీక్షించారు నిపుణులు. కానీ అతని చేతులప్పుడు తడిసి వుండడంవల్ల వేలిముద్రలు యేర్పడలేదు.

కారుమీద యింకెక్కడా స్పష్టమైన వేలిముద్రలు లేవు.

తెల్లవారుఝామున మూడుగంటలకి—బషీర్ బాగ్ లో పెట్రోలింగ్ చేస్తున్న ఒక పోలీసు వ్యానుకి, కిడ్నాపర్స్ ఉపయోగించిన వైట్ ఫియట్ కంటపడింది.

క్షణాలమీద నిపుణులాక్రమించి దానిమీద శల్య పరీక్షలు జరిపారు. వేలిముద్రలు చాలా దొరికాయి. రికార్డ్సుతో చ సరిచూశారు. అవి పాత కేడీలు నాగేష్, మల్లేశ్, రమేష్ లవని తేలింది. వెంటనే వాళ్ళకోసం గాలింపు మొదలయింది. కానీ ఈ మధ్య వాళ్ళ అడ్రసు మారిన సంగతి ఇంకా పోలీసులకి తెలియదు. గాలిస్తూనే వున్నారు వాళ్ళకోసం అలా....

పోలీస్ కంట్రోల్ రూంలో ఆపరేటర్ కో కాల్

అందింది: గ్రీన్ అంబాసిడర్, నెంబర్ ఎ.పి.టి. 9698, క్వారీ కాంట్రాక్టర్ వరవరరావుకి చెందింది. ఉదయం యెనిమిదింటికి అతని యింటి ముందు నించి మాయమయిం దని.

రాత్రి సెక్రటరీయేట్ దగ్గర బ్లాకేడ్‌ని ఛేదించుకొని, టాంక్‌బండ్ మీద అధికారిని పడగొట్టి వెళ్ళిపోయిన వైట్ ఫియట్‌లో యువతి సుహాసినియే అని ధృవపడింది అందరికీ. అయితే ఆమె బషీర్‌బాగ్‌లో కారు వదలి ఎటు పారిపోయిందీ తెలుసుకోలేకపోతున్నారు.

అదే సమయంలో సుహాసిని తల్లి శాంత నరకం అనుభ విస్తోంది, సంగతులేవీ తెలీక! రాత్రినించీ వెళ్ళినవాళ్ళ జాడ లేదు—ఆమెకి పిచ్చెత్తినట్లుంది!

అలా గడుపుతున్న సమయంలో హఠాత్తుగా ఫోన్ మోగి ఆమె గుండె లదరగొట్టింది! గబుక్కున వెళ్ళి అందుకుంది ఆరాటంగా.

అవతలి గొంతు శుష్కంగా పలికింది: "అమ్మా, నే నిక ఇంటికి రాలేనమ్మా."

అదిరిపడిందామె, "సుహాసినీ!" కేక పెట్టింది.

"క్షమించమ్మా, మీ అందర్నీ వదిలి వెళ్ళిపోతు న్నాను...."

"అయ్యయ్యో.... సుహాసినీ! ఏం మాటలే అవి! ఎక్క డున్నావు నువ్వు? యేం జరిగింది నీకు? నాన్న రాలేదా? అయితే నాకు చెప్పు, ఎక్కడ్నించి మాట్లాడుతున్నావు? వెంటనే వచ్చేస్తాను.... ఇప్పుడే...."

"నన్నిక మర్చిపోమ్మా."

"సుహాసినీ! అయ్యో, పిచ్చిదానా...."

"నన్నిక మర్చిపోమ్మా."

క్లిక్ మంది అవతల,

శాంత కొయ్యబారిపోయింది, చేతిలో రిసీవర్ వదిలేస్తూ.

*   *   *

సరిగ్గా ఉదయం పదకొండు గంటలకి తిరిగి బస చేరుకున్నారా ముగ్గురు.

ముగ్గురూ యెవరి ఆలోచనల్లో వాళ్ళున్నారు. ఆ గదిలో ఒక మూల చాపమీద కూర్చుని, పొట్లాలు కట్టి తెచ్చుకున్న పకోడీలు ఆరగించసాగారు.... బీరు సేవిస్తూ నిషా తల కెక్కుతూంటే అప్పుడు నోరారా వదరసాగారు. రాత్రి తాము పొందిన అనుభవం గురించి అసభ్యంగా మాట్లాడుకోసాగారు.

నాగేష్‌కి ఇరవై ఏళ్ళుంటాయి. మల్లేశ్, రమేష్‌లకి పద్దెనిమిది వుంటాయి. వాళ్ళు ముగ్గురూ తమ పాత నార్టన్ మోటార్ సైకిలుమీద పగలల్లా తిరుగుతూ, రాత్రికి ఎవరో ఒక భామతో బసకి చేరుకుంటారు, డబ్బుపెట్టి; డబ్బు లేనప్పుడు సభ్య స్త్రీలమీద అఘాయిత్యాలకి పూనుకుంటారు. అప్పుడే వాళ్ళు యెన్నో ఏళ్ల జైలు జీవితాన్ని చవిచూసినా, అందులోంచి నేర్చుకొన్న పాఠం యేమీ లేదు. కొన్నాళ్ళు జైలు, కొన్నాళ్ళు జల్సాలు, వాళ్ళ జీవితాల్లో భాగాలై పోయాయి.

నాగేష్ వాగుతున్నాడు బీరు సేవిస్తూ, "రాత్రి........ ఆహాఁ, రాత్రి బలే మజా చేశాంరా, మల్లేశూ!"

"ఇంకెప్పుడూ అలాటిదే కావాలంటాను, యేమిట్రా రమేషూ?" అడిగాడు మల్లేశ్.

రమేష్ వికారంగా నవ్వాడు: "ఆ పోరి.... రాత్రి పోరి బలే రంజాగా వుంది గానీ....ప్చ్, అనవసరంగా

అప్పుడే వదిలేశాం! అసలిక్కడే వుంచుకుంటే ఈ పగలంతా కూడా మజా చేసేవాళ్ళం కదా—"

"సరిగ్గా చెప్పావు, రమేషూ!" మల్లేశ్ అందుకున్నాడు, "ఓహ్, బజారుపోర్లతో బేజారై పోయాను, గురూ! పుణ్యానికొచ్చిన సరుకు.... దేనికి వదులుకున్నాం అప్పుడే?"

"ఊరుకోరా, బాధపడకు" నాగేష్ చెప్పాడు, "ఇవ్వాళ మరో మంచి పోరిని ఎత్తుకొద్దాం. కనీసం వారంరోజులు దున్నేద్దాం!"

"ఓకే! మార్వాడీ పోరిని తెద్దాం బాస్. బలే వూరి, రంగు తేలి వుంటారు....

సుమారు అరగంట తర్వాత ముగ్గురూ లేచి బయటకొచ్చారు. వర్షం కొద్దిగా పెరిగింది. వాళ్ళేం పట్టించుకోకుండా వెళ్ళి నార్టన్ యెక్కారు. వూరిమీదికి బయల్దేరారు.

నాగేష్ స్టార్టు చేసి నడుపుతున్నాడు. మిగతా ఇద్దరూ వెనుక కూర్చున్నారు. అప్పుడు బైక్ గేటు దాటి బయటికి రాగానే, అదే సందులో చివరగా ఆగివున్న గ్రీన్ అంబాసిడర్ కారు, చిన్నగా కదిలింది దాని వెనుక.

మోటర్ సైకిల్ నిదానంగా వెళ్తుంది.

వెనుక వస్తూన్న కారుని చాలాదూరంవరకూ చూసుకోలేదు వాళ్ళు. వాళ్ళెంత తాపీగా పోతున్నారో, అంతకంటే నిదానంగా వెంబడిస్తోందా కారు, ముప్పై అడుగుల దూరంలో.

చాపెల్ రోడ్ నుంచి చాదర్ ఘాట్ వైపు తిరిగే వరకూ అలాగే ప్రయాణించారు వాళ్ళు ముగ్గురూ. ఆ కారు అలాగే వస్తోంది వెనుక. అప్పుడెందుకో మల్లేశ్

వెనక్కి తిరిగి చూశాడు. అతని కళ్ళు ఎగిరిపడ్డాయి. తల గట్టిగా విదిలించి మళ్ళీ చూశాడు. అదిరిపడి ఒక్క అరుపు అరిచాడు, "బాస్! వెనక్కి చూడు!"

"ఏమయింది?...." రమేష్ అన్నాడు వెనక్కి తిరుగుతూ.

"ఆ కారులో చూడు...." చూపించాడు మల్లేశ్.

"అరె బాప్రే..." నోరు తెరిచాడు రమేష్. "సుహాసిని!"

నాగేష్ వేగం తగ్గిస్తూ వెనక్కి చూసి, "ఏమిటి.... యేం జరిగింది?" అన్నాడు. అతనికళ్ళు ఉలిక్కిపడ్డాయి. గాభరాగా ఏక్సిలేటర్ తిప్పేశాడు. వేగం పుంజుకుంది మోటర్ సైకిల్.

"ఆపకు! ఆపకు! పోనివ్వు! స్పీడ్!" వెనుక నుంచి మల్లేశ్ అరిచాడు.

నాగేష్ యింకా వేగం పెంచడంతో, వెనుక అంబాసిడర్ వేగం కూడా పెరిగిపోయింది. రెండూ ఇసామియా బజార్ లో పరుగెడుతున్నాయి, ఆ ట్రాఫిక్ లో.

అంత వేగంతో దూసుకొస్తున్న ఆ రెంటినీ చూసి ఎదురొస్తున్న వెహికల్స్ పక్కకు తప్పుకుని ఆగిపోతున్నాయి. జనం పేవ్ మెంట్లమీదికి దూకేస్తున్నారు. వెనుక నుంచి యిద్దరు తొందరపెడుతూంటే, నాగేష్ పిచ్చిగా ట్రాఫిక్స్ రూల్స్ని ఉల్లంఘించి తోలుతున్నాడు. ట్రాఫిక్ ఐలాండ్ దగ్గర వీళ్ళ ట్రిపుల్ రైడింగ్ చూసి ఆపబోయిన ఓ పోలీసు పక్కకు పారిపోవలసి వచ్చింది.

అంబాసిడర్ అంతకంతకూ దగ్గరయిపోతూంటే, వాళ్ళు వెర్రికేకలు వేస్తూ విన్యాసాలు చేస్తున్నారు. అప్పటికే

అవి రెండూ ఇసామియా బజార్ దాటేసి కోఠీవైపు పరుగుతీస్తున్నాయి....

కోఠి సెంటర్ దాటేసి బ్యాంక్ స్ట్రీట్ లో పడ్డాయి రెండు వాహనాలూ. వాళ్ళు వెనక్కి తిరిగి తిరిగి చూస్తూ అరుస్తోంటే, ట్రూప్ బజార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ముందు ఓ అధికారి అడ్డుకోబోయాడు.

ఆ అధికారి మోకాలు విరిగింది.

ఎదురొచ్చే సైకిళ్ళని, రిక్షాలని, ఆటోలనీ ఢీకొట్టుకుంటూ యెవర్నీ దేన్నీ లెక్కచేయకుండా స్వైర విహారం చేస్తున్న ఆ రెండు వాహనాల్నీ చూసి ఆబిడ్స్ సెంటరులో పోలీసులు ఉద్రిక్తులయ్యారు.

మోటర్ సైకిల్ ఫట్-ఫట్-ఫట్-మని చూస్తుండగానే అడ్డుకోబోయిన ఇద్దరు అధికారుల్ని పక్కలకి విసిరేసి మాయమైంది.

అంబాసిడర్ ధడాలున ఒక పోలీస్ మోటార్ సైకిలుకి గుద్ది, నెహ్రూ స్టాచ్యూ కేసి విసిరేస్తూ దూసుకెళ్ళింది.

రెండూ గన్ ఫౌండ్రీవైపు అనుమతిలేని ఆన్ కమింగ్ వన్ వే ట్రాఫిక్ లో పడ్డాయి. పడుతూనే అడ్డదిడ్డంగా ఎదురొచ్చే ప్రతివాన్నీ సర్దేస్తూ నిర్లక్ష్యంగా పరుగెత్తసాగాయి. వెనకనించి అనుచరుల అరుపులకి పట్టువిడవని విక్రమార్కుడిలా హాండిల్ చేస్తున్నాడు నాగేష్, బైక్ని.

వెనుక అంబాసిడర్ వాళ్ళకి భూతంలా కన్పిస్తోంది.... క్షణ క్షణానికీ దగ్గరయి పోతూంది....క్షణానికి కొన్ని అంగుళాల చొప్పున తగ్గిపోతోంది దూరం.

అంబాసిడర్ భూతం వేటకుక్కలా తరుముతోంది

వాళ్లని.... ఆ సమయంలో వాళ్ళేం చేస్తున్నారో వాళ్లకే తెలియదు. పడుతూ లేస్తూ, దారీ దిక్కూ తోచక, ప్రాణాలు రక్షించుకోడానికి, అంబాసిడర్ భూతా న్నించి దూరం దూరంగా తప్పించుకోడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్న ఆ క్షణంలో....

హఠాత్తుగా దురదృష్టం ఎదురైంది వాళ్లకి.

వెనుక అంబాసిడర్ భూతాన్ని వదిలించుకుందుకు తాజ్ హోటల్ వైపు మలుపుతిసుకోవాలని నాగేష్, కుడివైపు ట్రాఫిక్ ఐలాండ్‌ని రూలు ప్రకారం దాటించ బోయాడు — ఆ క్షణంలో అతడి మెదడు పని చేయలేదు.

వాళ్లలా చుట్టూ తిరిగేలోగానే వెనుక నున్న అంబా సిడర్ భూతం యిటు నుంచి తిరిగి వాళ్ల కెదురొచ్చే సింది....

బెదిరిపోయి చేతులు వదిలేసిన నాగేష్‌తోబాటు అతని అనుచరుల్ని బైక్‌తో సహా అడ్డంగా నెట్టుకుంటూ వెళ్ళి కాంపౌండ్ గోడకి వత్తేసింది. తావ్-తావ్-పట పట-ధడ్ ధడ్-కవ్వు కవ్వుమన్న శబ్దాలతో మారుమ్రోగి పోయిందా ప్రాంతం.

ముగ్గురూ నలిగి పచ్చడయ్యారు, గోడకీ కారుకీ మధ్య.

అంటించిన పోస్టర్స్‌లా వుండిపోయారు గోడల కలాగే.

కారు వెనక్కి జరిగితే తప్ప వాళ్ల శవాలు రావు.

కారు మరి కదల్లేదు, ఇంజన్ ఆఫ్ అయింది.

ఇక పూర్తి విశ్రాంతే నన్నట్టు నిలబడిపోయింది. వెను కనే పోలీసు వాహనాలు సైరన్‌లు వూదుకుంటూ వచ్చి

ఆగాయి.

భీభత్సాన్ని చూసి అరిచే జనం, ఆగిపోయే వాహనాలు, విజిల్స్ ఊదే అధికారులతో క్షణాలమీద కల్లోలమైందా ప్రాంతం.

అప్పుడా గుంపులోంచి ఒకతను వేగంగా బయటికొచ్చాడు. అతను అటు యిటూ చూసుకుంటూ గబగబా హోటల్ గేటుదగ్గర కొచ్చాడు. అక్కడ సైకిలుతో నిల్చున్న మనిషికేదో చెప్పాడు. ఆ మనిషి తలూపి సైకిలిచ్చేశాడు.

సైకిలు తీసుకున్న మనిషి దానిమీదెక్కి తొక్కుకుంటూ వెళ్ళిపోసాగాడు.

అతనెక్కడా ఆగకుండా ఉద్రేకంగా. ఆరాటంగా తొక్కుతూ రాంకోట్‌లోని జైహింద్ కేఫ్‌కి చేరుకున్నాడు. సైకిలు బయట నిలిపి లోపలికి పరుగుతీశాడు విసురుగా. కౌంటర్‌లో బిజీగా వున్న సేట్‌ని విష్ చేసి టెలిఫోనెత్తాడు. చకచకా ఒక నెంబర్ తిప్పి, రెస్పాన్స్ రాగానే మాట్లాడసాగాడు తగ్గుస్వరంతో....

* * *

"ఎందుకు నువ్విలా చేశావ్?"

ఆమె చెప్పలేదు.

"రాత్రంతా ఎక్కడున్నావ్?"

ఆమె మాట్లాడలేదు.

"నిన్నేం చేశారు వాళ్ళు?"

ఆమె నోరు విప్పలేదు.

"నువ్వు చేసింది చట్టరీత్యా నేరమని తెలుసా?"

(ఇంకా వుంది)